
సాక్షి
ఒడిశా

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని, ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,90,928లు, బంగారం 38 గ్రాములు, వెండి 35.96గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



సరికొత్త పంథాతో మావోయిజాన్ని రూపుమాపాలి

- డీజీపీ సునీల్‌కుమార్ బన్సాల్ పిలుపు

- 8లో.



భువనేశ్వర్-దుబాయ్ విమాన సేవలు

- టికెట్ విక్రయాలను ప్రారంభించిన సీఎం నవీన్ పట్నాయక్

- 8లో.

న్యూస్‌రీల్

6 టన్నుల గంజాయికి నిప్పు



గంజాయిని ధ్వంసం చేసిన అధికారులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్, గుడారి, గుణుపూర్, బిసంకటక్, రాయగడ, చంద్రపూర్, మునిగుడ, పుట్టాసింగి తదితర ప్రాంతాల్లో పోలీసులు వివిధ సందర్భాల్లో దాడులు నిర్వహించి, 6021.738 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిని తెరువలిలోని ఇండియన్ మెటల్స్, ఫెర్రో అల్లాయిస్ కర్మాగారంలో శుక్రవారం నిప్పంటించి, ధ్వంసం చేశారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ ట్విట్టర్ ద్వారా శనివారం ప్రకటించారు. గత కొద్ది రోజులుగా నిర్వహించిన ఈ దాడుల్లో 40కేసులు నమోదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అభిరాం బెహరా, డీఎస్పీ తవుడియా తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం తయారీపై దాడులు



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న విదేశీ మద్యం బాటిళ్లు

బరంపురం: జిల్లాలోని పుకిడిబందా పరిధి నారాయణపూర్ గ్రామంలో ఓ ఇంట్లో రహస్యంగా నిర్వహిస్తున్న నకిలీ మద్యం తయారీ కేంద్రంపై బరంపురం ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు చెపట్టారు. ఇందులో వెయ్యికి పైగా నకిలీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే 68.4 లీటర్ల విదేశీ మద్యాం పట్టుబడిందని ఎక్సైజ్ అధికారి గీతాంజలి దాస్ తెలిపారు.

చెరువులో పడి బాలిక మృతి



బాలిక మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖొయిర్‌పుట్ సమితి కుడుములగుమ్మ పరిధిలో పర్కన్‌మాల పంచాయతీ సరిమెట్ల గ్రామంలో ప్రమాదావశాతు చెరువులో మునిగి బాలిక మృతిచెందింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శంకర్ సాగరియా కుమార్తె గాయత్రీ(11) తోటి పిల్లలతో కలసి శుక్రవారం సాయంత్రం చెరువుకు స్నానానికి వెళ్లింది. అయితే కాలుజారి పడిపోవడంతో తోటి వారు గ్రామస్తులకు సమాచారం అందించారు. బాలిక తండ్రి వెంటనే అక్కడకు చేరుకొని, చెరువు నుంచి బయటకు తీశారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుడుములగుమ్మ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందిందని వైద్యులు తెలిపారు. ఘటనపై ఖొయిర్‌పుట్ సమితి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు శనివారం అప్పగించారు.

బస్సు ఢీకొని చిన్నారి మృతి



ఘటనా స్థలంలో బస్సు, బైకు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ-బలిమెల ప్రధాన రహదారిలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండేళ్ల చిన్నారి మృతిచెందింది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్రకొండ సమితి చంపఘర్ పంచాయతీకి చెందిన ఘూసీ హంతాల్ భార్య శుక్రి హంతాల్, కుమారుడు గురు హంతాల్, కుమార్తె బుటి హంతాల్ బైక్‌పై శనివారం ఉదయం అల్లంపక గ్రామానికి వెళ్తున్నారు. ఎదురుగా అతివేగంగా వస్తున్న ప్రైవేటు బస్సు వారి వాహనాన్ని బలంగా ఢీకొనడంతో గురు హంతాల్(2) అక్కడికక్కడే మృతిచెందాడు. ఘూసీ, భార్య, కుమార్తెకు తీవ్ర గాయాలవ్వడంతో స్థానికులు మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ వాహనాన్ని విడిచి, పరారయ్యాడు. చిత్రకొండ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మురిసిన ఉత్కళం




పర్లాకిమిడి: గజపతి మహారాజా సమాధి వద్ద అధికారులు, ప్రజా ప్రతినిధులు



పర్లాకిమిడి: గజపతి ప్యాలెస్ వద్ద యువకుల సాము గారడీ ప్రదర్శనలు

- వాడవాడలా ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవాలు
- కృష్ణచంద్ర గజపతి, గోపబంధు దాస్‌కు నివాళులు
- ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు

పర్లాకిమిడి: రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు వాడవాడలా ఘనంగా జరిగాయి. బీహార్, మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి 1936లో ఉత్కళ రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన మహారాజా కృష్ణచంద్ర గజపతి, ఉత్కళమణి గోపబంధు దాస్ తదితరుల సేవలను కొనియాడారు. వారి విగ్రహాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు పూలుమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా పర్లాకిమిడిలోని కుమ్మరి వీధిలో ఉన్న కృష్ణచంద్ర గజపతి సమాధి వద్ద ఆయన వంశీయురాలు యువరాణి కల్యాణీదేవి గజపతి పుష్పాంజలి ఘటించారు. పక్కనే ఉన్న తన తండ్రి గోపీనాథ గజపతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, కలెక్టర్ లింగరాజ్ పండా, పురపాలక అధ్యక్షురాలు నిర్మలాశెఠి, ఎస్డీసీ చైర్‌పర్సన్ మరియం రైతో, ఏడీఎం సంగ్రాంశేఖర పండా, సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్, తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా పాయక్ సాయుధ యోధులు కత్తి, కర్రసాము గారడీ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



బరంపురం: ఇసుకతో సత్యమహరాణ తీర్చిదిద్దిన శిల్పం



పర్లాకిమిడి: గోపినాథ గజపతికి నివాళులర్పిస్తున్న యువరాణి కల్యాణీదేవి గజపతి



పర్లాకిమిడి: విజేతలకు బహుమతి అందిస్తున్న ఎస్డీసీ చైర్‌పర్సన్ మరియం రైతో



జయపురం: ఉత్కళ సమ్మిళనిలో పాల్గొన్న అతిథులు



రాయగడ: వివిధ వేషధారణలో చిన్నారుల నృత్యాలు

- పర్లాకిమిడిలో డీఆర్‌డీఏ శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గవర తిరుపతిరావు, కలెక్టర్ లింగరాజ్ పండా, ఖల్లికోట్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మన్మథ పాడి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు అందించారు.
- రాష్ట్రానికి స్వతంత్రం సాధించిన కృష్ణచంద్ర గజపతి నారాయణదేవ్‌కు సముచిత స్థానం ఇవ్వలేదని, ఈ ఏడాది ఉత్కళ దివాస్ ముందస్తు సమావేశాలు ఏర్పాటు చేయలేక పోవడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు రద్దు చేశారని మీడియా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా అధికారుల ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్ క్షమాపణలు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.
- బరంపురం: మహాపురుషుల త్యాగాఫలమే ప్రత్యేక ఒడిశా ఆవిర్భావమని బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు పేర్కొన్నారు. బరంపురం మున్సిపాలిటీ కార్పొరేషన్(బీఎంసీ) పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో గాంధీనగర్ మెయిన్ రోడ్డులో జరిగిన కార్యక్రమంలో మధుసూదన్ దాస్, పాత బస్టాండ్‌లో శశిభూషన్ రథ్, కార్పొరేషన్ రోడ్డులో బిజూ పట్నాయక్, విజయ టాకీస్ జంక్షన్‌లో కృష్ణచంద్ర గజపతి విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విక్రమ్‌పండా, బీఎంసీ మేయర్ సంఘమిత్ర దొళాయి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.
- జయపురం: సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ తదితరులు స్థానిక అధికారులు లేబర్ కాలనీ కూడలిలో ఉన్న కృష్ణచంద్ర గజపతి, రాజనగర్ కూడలిలో మధుసూదన దాస్ విగ్రహానికి నివాళులర్పించారు. మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, ఉత్కళ సమ్మిళిని కొరాపుట్‌శాఖ అధ్యక్షుడు మదన మోహన నాయక్, కార్యదర్శి నవీన మదల, భీరేన్ మోహన పట్నాయక్, వినోద్ మహాపాత్రొ, జి.వెంకట్రావు పట్నాయక్, దేవేంద్ర బాహిణీపతి తదితరులు పాల్గొన్నారు.
- రాయగడ: జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, ఏడీఎం ధర్మానంద బెహరా, సోమనాథ్ ప్రధాన్, డీపీఆర్‌ఓ బసంతకుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని తృప్తి కూడలి నుంచి భారీ ర్యాలీ నిర్వహించి, మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ సరస్వతి మాఝీ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సాయిప్రియ నగర్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.
- మల్కన్‌గిరి: స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయ ప్రాంగణంలోని ఉత్కళమణి గోపబంధు దాస్ విగ్రహానికి కలెక్టర్ విశాల్‌సింగ్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మాధుసూదన్ దాస్, మహరాజా కృష్ణచంద్ర గజపతి తదితరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సోమారి టంగులు, జిల్లా అభివృద్ధి అధికారి రత్నాకర్ సాహు, సబ్ కలెక్టర్ అక్షయకుమార్ ఖెముండు, మల్కన్‌గిరి మున్సిపాలిటీ ఈఓ కన్నుచరణ్ పట్నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి మానస్‌కుమార్ జెనా, డీఆర్‌డీఏ అధికారి ప్రమీల మాఝి తదితరులు పాల్గొన్నారు.



జయపురం: బొయిపరిగుడలో ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న పాత్రికేయుడు విక్రాంత బెహరా



బరంపురం: బిజూ పట్నాయక్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీ శేఖర్‌సాహు, ఎమ్మెల్యే, మేయర్




మల్కన్‌గిరి: గోపబంధు దాస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ విశాల్‌సింగ్



రాయగడ: ర్యాలీలో పాల్గొన్న మంత్రి సరక, నెక్కంటి, ఎమ్మెల్యే

ఒడియా వ్యక్తిగా గర్వపడాలి..



భువనేశ్వర్: మాట్లాడుతున్న నైజర్ డైరెక్టర్ సుధాకర్ పండా

భువనేశ్వర్: ఒడియా వ్యక్తిగా రాష్ట్ర ప్రజలంతా గర్వ పడాలని, మాతృభాష, సాహిత్యం, ఆచార వ్యవహారాలు దైనందిన జీవన స్రవంతిలో భాగం కావాలని ఖండపడా ఎమ్మెల్యే, స్థానిక దినప్రతిక సంపాదకుడు సౌమ్యరంజన్ పటాన్నయక్ పిలుపునిచ్చారు. స్థానిక జాతీయ విజ్ఞాన విద్య పరిశోధన సంస్థ(నైజర్‌లో నిర్వహించిన ఉత్కళ దివస్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. నైజర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్ పండా అధ్యక్షత వహించగా, ఉత్కళ సంస్కృతి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ స్వాయి ప్రసంగించారు. నైజర్ రిజిస్ట్రార్ డాక్టర్ అభయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుతో లాభాలెన్నో

- జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు
- సెంచూరియన్‌లో ఫుడ్‌టెస్టింగ్ ల్యాబ్, విత్తన శుద్ధి కర్మాగారం ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు

పర్లాకిమిడి: జిల్లాలోని ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో గ్రామ్ తరంగ్ ఆధ్వర్యంలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్, హైబ్రిడ్ సుపీరియా మొక్కజొన్న విత్తనాలు, వరి, బెండ, ఓక్రా హైబ్రిడ్ విత్తనాల శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు. దీనిని జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు శనివారం ప్రారంభించారు. తొలుత వర్సిటీని సందర్శించి, ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజపతి జిల్లాలో మోహనా ప్రాంతం చంద్రగిరిలో టిబిటెన్లు మొక్కజొన్న ఎక్కువగా సాగు చేస్తున్నారని గుర్తుచేశారు. అలాగే గుసాని, గుమ్మా, కాశీనగర్ తదితర ప్రాంతాల్లో రైతులు స్వీట్‌కార్న్, బేబీకార్న్, మొక్కజొన్న తదితర రకాలు సాగు చేస్తూ అధిక లాభాలు పొందుతున్నారని తెలిపారు. సెంచూరియన్‌లో విత్తనాల శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతానికి చెందిన అన్నదాతలకు ఎంతో మేలు చేకూరుస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పర్లాకిమిడిలోని అటవీశాఖ కార్యాలయం రోడ్డులో గ్రామతరంగ్ పరిశ్రమలో మొక్కజొన్న విత్తనాల ల్యాబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డీఎస్‌పీ నందా, రిజిస్ట్రార్ అనితా పాత్రొ, డైరెక్టర్(అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ దుర్గాప్రసాద్ పాఢి, గుసాని సమితి చైర్మన్ ఎం.వీర్రాజు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ ప్రీత, జోన్-1 జెడ్పీటీసీ బాలరాజు, ఎంఎస్ స్వామినాథన్ వ్యవసాయ విద్యాలయం ప్రొఫెసర్ జొన్నలగడ్డ అనీల్‌కుమార్, స్వాస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డి.జగన్నాథరాజు, రెగ్యులేటరీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఎస్.గజపతిరావు, గ్రామతరంగ్ అధికారులు మన్మథ, సంబిత్ పాత్రొ తదితరులు పాల్గొన్నారు.



ఓక్రా మొక్కజొన్న విత్తనాల ల్యాబ్‌ను సందర్శిస్తున్న జెడ్పీ చైర్మన్, సెంచూరియన్ అధికారులు

చైత్రోత్సవం ప్రారంభం

- సుందరంగా ముస్తాబైన మజ్జిగౌరి మందిర ప్రాంగణం



స్వర్ణాలంకరణలో దర్శనమిస్తున్న మజ్జిగౌరి అమ్మవారు

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం మజ్జిగౌరి అమ్మవారి వార్షిక ఉత్సవాలు చైత్రోత్సవ పూజలు శనివారం సంప్రదాయంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్ర సమీపంలోని జంఝావతి నది నుంచి శుద్ధ జలాలు తీసుకువచ్చిన కమిటీ సభ్యులు.. వాటిని మందిర ప్రాంగణంలో నిలిపి, ప్రత్యేక పూజలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. గంజాం జిల్లా సొరడ ప్రాంతానికి చెందిన వేద పండితులు నీలమాధవ త్రిపాఠి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ముందుగా సూర్యమండల పూజ నిర్వహించిన పండిత బృందం.. అనంతరం మండపంలో కలశాలతో నదీ జలాలను నింపి, సూర్యావహన పూజలు జరిపారు. మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, వడ్డాది శ్రీనివాసరావు, పెద్దిన వాసు, పాలకొండ ప్రకాష్ దంపతులు పాల్గొనారు. వీరంతా 5రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ఉపవాస దీక్ష పాటిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆదివారం చండీ పఠనం, చండీ హోమం జరగనున్నాయి.



సుందరంగా ముస్తాబైన మందిర ప్రాంగణం



పూజల్లో పాల్గొన్న కమిటీ సభ్యులు

సునాబేసోలో అమ్మవారు..

ఉత్సవాలు సందర్భంగా మజ్జిగౌరి అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించారు. దీనినే సునాబసోగా వ్యవహరిస్తారు. ఈ 5రోజుల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు ఆంధ్ర, తెలంగాణ, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. యాత్రికుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామని మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి తెలిపారు. అమ్మవారిని ఈ సందర్భంగా పండ్లతో, ఆలయాన్ని పువ్వులతో అలంకరించారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్న అర్చకులు

రాయగడ: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బాలాజీ నగర్ కల్యాణ వేంకటేశ్వర మందిరంలో సత్యనారాయణ వ్రతాలు శనివారం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేపట్టారు.

మూడో వారంలో టిడ్కో ఇళ్లు అందజేత



పాత్రునివలసలో మంచినీటి పనులను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

శ్రీకాకుళం రూరల్: ఈ నెల మూడో వారంలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. శనివారం పాత్రునివలసలోని టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఇంజినీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లతో కలిసి పనులపై సమీక్షించారు. నాగావళి నది నుంచి మంచినీటి సరఫరా, ఎస్టీపీ ట్రయల్ రన్ పనులపై ఆరా తీశారు. 1280 టిడ్కో ఇళ్లను నిర్ణీత కాలంలో పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. ఈయనతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ ఓబులేషు, మెప్మా డైరెక్టర్ కిరణ్‌కుమార్, టిడ్కో సూపరింటెండెంట్ ఇంజినీర్ నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



మృతి చెందిన జింక

ఎచ్చెర్ల క్యాంపస్: కుక్కల దాడిలో జింక మృతిచెందింది. శనివారం ఎస్‌ఎంపురం కొండ నుంచి చెరువులో నీరు తాగేందుకు ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ సమీపంలోకి వచ్చిన జింకను కుక్కల గుంపు వెంబడించింది. సాంకేతిక శిక్షణ కేంద్రం సిబ్బంది జింకను రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అటవీ శాఖ అధికారులు వచ్చేలోపే జింక మృతి చెందింది. అనంతరం జింకకు అత్యక్రియలు నిర్వహించారు.

పాడేరుకు ఏరువాక కేంద్రం తరలింపు



ఆమదాలవలసలోని వ్యవసాయ పరిశోధన కేంద్రం

ఆమదాలవలస: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా(ఆమదాలవలస)లోని ఏరువాక కేంద్రాన్ని పాడేరు తరలించినట్లు సమన్వయకర్త డాక్టర్ జె.జగన్నాథం శనివారం తెలిపారు. ఇకపై శాస్త్రవేత్తలు, సిబ్బంది పాడేరులోని సీడ్‌ఫాం గోదాము వద్ద ప్రారంభించిన వ్యవసాయ పరిశోధన కేంద్రంలో విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

• అరటి గెలల నీరాజనం



సారవకోట మండలం వెంకటాపురంలో కోదండ రామస్వామి ఆలయం వద్ద శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా భక్తులు వందలాది అరటి గెలలు వేలాడదీశారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకునే క్రమంలో వీటిని వేలాడదీసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

– సారవకోట

సరికొత్త పంథాతో మావోయిజాన్ని రూపుమాపాలి

- డీజీపీ సునీల్‌కుమార్ బన్సాల్ పిలుపు
- ఘనంగా 88వ పోలీసు వ్యవస్థాపక దినోత్సవం



డీజీపీ సునీల్ బన్సాల్ నుంచి డిస్క్ అవార్డు స్వీకరిస్తున్న ఖుర్దా జిల్లా డీసీపీ మానసరంజన్ బారిక్



బరంపురం: ఉత్తమ పురస్కారాలు అందుకున్న పోలీసు అధికార్లతో డీఐజీ సత్యబ్రత్, ఎస్పీ వివేక్

భువనేశ్వర్: మావోయిస్టుల బెదిరింపుల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించడంలో పోలీసు సిబ్బంది సరికొత్త పంథా అనుసరించాలని రాష్ట్ర డీజీపీ సునీల్‌కుమార్ బన్సాల్ పిలుపునిచ్చారు. విధులను అంకితభావం, నిజాయితీ, నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. వివిధ భద్రతా రంగాలలో సాధించిన విజయాలకు డిపార్ట్‌మెంట్ ఖ్యాతిని ఆర్జించిందని, శాంతి భద్రతల పరిరక్షణ, హై ప్రొఫైల్ కేసులను పరిష్కరించడంలో మరింత కీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. శనివారం ఒడిశా పోలీసు 88వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కటక్ 6వ బెటాలియన్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు సిబ్బందికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను సన్మానించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అలాగే విధి నిర్వహణ రంగంలో అంకిత భావంతో అసాధారణ ప్రతిభ ప్రదర్శించిన పోలీసు సిబ్బందికి డీజీపీ డిస్క్ అవార్డు ప్రదానం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 115మంది సిబ్బంది ఈ అవార్డును అందుకున్నారు. స్పెషల్ ఆపరేషన్స్ గ్రూపు ఎస్‌ఓజీ, ఒడిశా సాయుధ పోలీసు దళం, ఐఆర్‌బీ, కటక్-భువనేశ్వర్ యూపీడీ, ట్రాఫిక్ కానిస్టేబుల్, కటక్-భువనేశ్వర్ కమిషనరేట్, ఓడ్రాఫ్, ఓఐఎస్ఎఫ్, ఓఎస్ఏఎఫ్, అగ్నిమాపక దళం జవాన్లు కవాతులో పాలుపంచుకున్నారు.

పోలీసు సేవలు మరువరానివి..



రాయగడ: ఉత్తమ ఎస్ఐగా చక్రధర్ బెహరాను సన్మానిస్తున్న ఎస్పీ శర్మ

బరంపురం: విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలందిస్తున్న పోలీసు అమరవీరుల త్యాగాలు మరువరానివని దక్షిణాంచల్ డీఐజీ సత్యబ్రత్ బొయి కొనియాడారు. అంబపువా పోలీసు రిజర్వ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్‌తో కలిసి సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఉత్తమ పోలీసు అధికార్లను అవార్డులతో సత్కరించారు. జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లో జరిగిన కార్యక్రమంలో గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మినా, ఏఎస్పీ ఠాగూర్ ప్రసాద్ పాత్రో, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆడంబరంగా వ్యవస్థాపక దినోత్సవం..



మల్కన్‌గిరి: ఉత్తమ ఐఐసీకి ప్రశంసాపత్రం అందిస్తున్న ఏఎస్పీ బలభద్ర దీప్



పర్లాకిమిడి: మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్

రాయగడ: పట్టణానికి సమీపంలోని చందిలి రిజర్వ్ పోలీసు మైదానంలో పోలీసు వ్యవస్థాపక దిపోత్సవాన్ని ఆడంబరంగా నిర్వహించారు. ఎస్పీ వివేకానంద శర్మ హాజరై, పోలీసు బలగాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. 2022 ఏడాదికి గాను ఉత్తమ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా చక్రధర్ బెహరా, ఉత్తమ ఏఎస్ఐగా ఉమాకాంత సాబోరో, హవాల్దార్‌గా రత్నమణి సాహు, ఉత్తమ ఓఆర్ కానిస్టేబుల్‌గా మాలబింధు జుధిష్టర్ బెహరా, ఏపీఆర్ కానిస్టేబుల్‌గా నరేష్‌కుమార్ సాహు, ఉత్తమ ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా నిరాకర్ ఆరుఖ్ లను సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ తవుడియా, రాయగడ, చందిలి ఐఐసీలు హాజరయ్యారు.

- **మల్కన్‌గిరి:** జిల్లా ఎస్పీ కార్యాలయం సమీపంలోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ఏఎస్పీ బలభద్ర దీప్ ఉత్తమ సేవలందించిన ఏడుగురు ఐఐసీలను ప్రశంసాపత్రాలతో సత్కరించారు.
- **పర్లాకిమిడి:** స్థానిక గజపతి స్టేడియంలో నిర్వహించిన పోలీసు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ స్వాతీ ఎస్.కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం రాష్ట్ర హోంశాఖ, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పంపిన సందేశాన్ని చదివి, వినిపించారు. అలాగే దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్డీపీఓ రామకృష్ణపతి, ఆదర్శ పోలీసు స్టేషన్ ఐఐసీ బబులీ నాయక్, గారబంద, కాశీనగర్, రాయఘడ, సెరంగో పోలీసు స్టేషన్ల ఇన్‌చార్జి అధికారులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: పరేడ్‌లో పాల్గొన్న జిల్లా పోలీసులు



పర్లాకిమిడి: కవాతు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

భువనేశ్వర్-దుబాయ్ విమాన సేవలు



భువనేశ్వర్-దుబాయ్ తొలి టికెట్ కొనుగోలుదారులతో సీఎం నవీన్ పట్నాయక్

- టికెట్ విక్రయాలను ప్రారంభించిన సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భువనేశ్వర్-దుబాయ్ ప్రత్యక్ష అంతర్జాతీయ విమాన యాన సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఉత్కళ దివస్ పురస్కరించుకుని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ టికెట్ల విక్రయాన్ని శనివారం ప్రారంభించారు. భువనేశ్వర్‌లోని నవీన్ నివాస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తొలి టికెట్ కొనుగోలు చేసిన వారి సీఎం చేతుల మీదుగా బోర్డింగ్ పాసులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి కీలకమైన అనుసంధాన కార్యాచరణకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులను విశేషంగా ఆకట్టుకోవడంలో భువనేశ్వర్-దుబాయ్ ప్రత్యక్ష అంతర్జాతీయ విమాన సౌకర్యం దోహదపడుతుందని తెలిపారు.

రాకపోకలకు రూ.20 వేలు..

స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి రాత్రి 9.45 గంటలకు దుబాయ్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో దుబాయ్ నుంచి మధ్యాహ్నం 11.25 గంటలకు బయల్దేరి సాయంత్రం 5.20 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. ఈ ఏడాది మే 15నుంచి రోజువారీ సేవలు అందుబాటులోకి వస్తాయి. మిషన్‌శక్తి మహిళలు, క్రీడాకారులు, గిరిజన నాయకులు, ఒడిశాలో నైపుణ్యం కలిగిన విద్యార్థులు, కళాకారులకు తొలి ఎనిమిది టిక్కెట్లను కొనుగోలు చేశారు. వీరందరికి ఆయన ప్రత్యక్షంగా బోర్డింగు పాసులు ప్రదానం చేశారు. వీరిలో సుందర్‌గడ్ ఎస్‌డీసీ చైర్‌పర్సన్ బినయ్‌కుమార్ టొప్పో, కెంజొహర్ ఎస్‌డీసీ చైర్‌పర్సన్ లక్ష్మీ నాయక్, కొరాపుట్ డీఎల్ఎఫ్ అధ్యక్షురాలు జ్యోతిరేఖ సెఠి, సైకతశిల్పి సుదర్శన్ పట్నాయక్, ఫుట్‌బాల్ క్రీడాకారిణి అనురాధ బిస్వాల్, షూటర్ శ్రియాంక షడంగి, జాజ్‌పూర్ ప్రభుత్వ ఐటీఐకి చెందిన బలరామ్ రౌత్, రౌర్కెలా ప్రభుత్వ ఐటీఐకి చెందిన హిమాంశు సాహు ఉన్నారు. దుబాయ్‌కి ప్రత్యక్ష అంతర్జాతీయ విమానయాన సేవలు ప్రారంభించిన 2వారాల్లో సింగపూర్, బ్యాంకాక్‌లకు అంతర్జాతీయ విమాన సేవలు ప్రారంభిస్తారు. ఒక్కోవైపు ప్రయాణానికి ప్రారంభ టిక్కెట్ ధర రూ.10వేలు, రాకపోకలకు రూ.20 వేలుగా నిర్ధారించారు. ఈ రాయితీ టిక్కెట్లు ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ ప్రాతిపదికన లభ్యమవుతాయి.


రాయగడలో నిఘానేత్రాలు

- కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ప్రారంభించిన మంత్రి సరక



కమాండ్ కంట్రోల్ రూంను ప్రారంభిస్తున్న మంత్రి జగన్నాథ సరక


రాయగడ: పట్టణంలో సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థను రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక శనివారం ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో వీటికి సంబంధించి ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న రాయగడ వంటి పట్టణంలో దోపిడీలు, దొంగతనాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు ఇకపై చెక్ పెట్టే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే కెమెరాల సాయంతో నిందితులను సులభంగా గుర్తించి, పట్టుకునే అవకాశం ఉందన్నారు. వీటి ఏర్పాటు అనివార్యంగా భావించిన రాష్ట్రప్రభుత్వం రూ.70 లక్షల నిధులు కేటాయించిందని తెలిపారు. జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన కూడళ్లతో పాటు మరికొన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో 107 సీసీ కెమెరాలను అమర్చామని వెల్లడించారు. త్వరలో మరికొన్ని ప్రాంతాల్లో అమరిక పూర్తి చేస్తామని, పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోని కంట్రోల్ రూం నుంచి వీటిని నిరంతరం పరిశీలించేందుకు అదనంగా సిబ్బందిని నియమించామని పేర్కొన్నారు. ప్రధాన ప్రాంతాల్లో హైపవర్ కెమెరాలను ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక, కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి యాసీన్ బిలాల్ అహ్మద్, స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ అనసూయ మాఝి, బీజేడీ నాయకుడు సుధీర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అమర్చిన సీసీ కెమెరాలు

రాష్ట్రానికి మెట్రో మణిహారం

- భువనేశ్వర్-కటక్ మధ్య ఏర్పాటుకు సీఎం నవీన్ ఆమోదం



మెట్రోరైలు ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేస్తున్న సీఎం నవీన్



ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

భువనేశ్వర్: 'మహానాయకుడు బిజూ బాబు శక్తివంతమైన ఒడిశాను ఆకాంక్షించారు. ఆ దిశగా మెట్రో రైలు ప్రాజెక్టు ముందడుగు వేసింది. ఇది శక్తివంతమైన, అధునాతన ఒడిషాకు పునాది వేసింద'ని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తెలిపారు. శనివారం ఒడిశా అవతరణ దినోత్సవం సందర్భంగా జంట నగరాలు కటక్-భువనేశ్వర్ మధ్య మెట్రో రైలు ప్రాజెక్టు కార్యాచరణపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు సర్వే నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా ఆధ్వర్యంలో 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్, పలువురు సీనియర్ అధికారులు మెట్రోరైలు ప్రయాణించే అన్ని మార్గాలను సమీక్షించారు. వేకువజాము 4.30 గంటలకు అధికారులు వీధుల్లో పర్యటించి, సమీక్ష చేపట్టారు. మెట్రో రైళ్లను నడిపేందుకు అనుకూలత, రైళ్లు నడపడానికి ఏమేం అవసరమో అక్కడిక్కడ చర్చించారు. ట్రాఫిక్ ఏర్పాట్ల నుంచి పార్కింగ్ వరకు అన్ని అంశాలను సమీక్షించారు. దీంతో త్వరలో రాజధానిలో మెట్రో రైలు ప్రాజెక్టు కార్యరూపం దాల్చుతుందని సర్వత్రా ఆశాభావం వ్యక్తం అవుతోంది. సమీక్షలో రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ అను గర్గ్, రవాణాశాఖ కార్యదర్శి ఉషా పాఢి, గృహనిర్మాణం, నగర అభివృద్ధిశాఖ కార్యదర్శి జి.ముత్తువత్తనన్, ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ మనోజ్‌మిశ్రా, పోలీస్ కమిషనర్ సౌమేంద్రకుమార్ ప్రియదర్శి పాల్గొన్నారు.

బిజూ పట్నాయక్ విమానాశ్రయానికి..

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి మెట్రోరైలు ప్రాజెక్టు జంట నగరాలు కటక్, భువనేశ్వర్‌ను అనుసంధాన పరుస్తుందని వెల్లడించారు. తదుపరి దశల్లో పూరీ, ఖుర్దాలకు విస్తరిస్తామన్నారు. తొలి దశలో కటక్ త్రిశూలియా నుంచి భువనేశ్వర్ లోని బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు ప్రాజెక్టు పనులు చేపడతామని తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద నందన్‌కనన్, పటియా, వాణీవిహార్, త్రిశూలియా, స్థానిక విమానాశ్రయం, ప్రధాన రైల్వేస్టేషన్ లను అనుసంధాన పరుస్తుందని పేర్కొన్నారు. కటక్ నగరంలో ప్రధాన ప్రదేశాలకు మెట్రోరైలు తొలి దశ ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

ఉత్కళ దివస్ శుభాకాంక్షలు

ఒడిశా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. మెట్రోరైలు ప్రాజెక్టుతో ప్రత్యేక ఒడిశా చిరకాల వాంఛ నేడు నెరవేరిందన్నారు. ఉత్కళ దివస్ రాష్ట్ర ప్రజలందరికీ గౌరవ ప్రతిష్టల ప్రతీకని, ఈ రాష్ట్ర వర పుత్రులందరికీ నివాళులర్పించారు. వర పుత్రుల మార్గదర్శకంతో సుభిక్షమైన ఒడిశా దినదినాభివృద్ధి చెందుతుందని ఆనందం వ్యక్తం చేశారు.

ఐఐటీ జీ20 జన్ భాగీదారి ప్రారంభం



ఐఐటీ ఆవరణలో సైక్లథన్ ప్రారంభిస్తున్న



జీ20 జన్ భాగీదారి పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

భువనేశ్వర్: జీ20 సదస్సు పురస్కరించుకుని ప్రజా భాగస్వామ్యం(జన్ భాగీదారి) కార్యక్రమాన్ని ప్రారంభించారు. భువనేశ్వర్ భారతీయ సాంకేతిక సంస్థ(ఐఐటీ) ఈ కార్యక్రయాన్ని శనివారం అత్యంత ఆనందోత్సాహాలతో నిర్వహించింది. ఈ సందర్భంగా రాష్ట్రం, దేశంలోని ఇతర ప్రాంతాలలో విద్యా కార్యవర్గ సమావేశం, అనుబంధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద్ కర్మాల్కర్ తెలిపారు. ఐఐటీ సమన్వయం, అనుసంధానంతో భువనేశ్వర్, ఖుర్దా, పూరీ కటక్ జిల్లాలో కేంద్ర విద్యాశాఖ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాలు నెల రోజులు నిరవధికంగా కొనసాగుతాయని పేర్కొనారు. జీ20 సదస్సుకు ఆతిథ్యమిచ్చిన స్ఫూర్తితో నిర్వహించిన సైక్లథన్ ఐఐటీ క్యాంపస్ ఆవరణలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మెయిన్ గేట్ నుంచి ఖుర్దా రోడ్ రైల్వేస్టేషన్ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జీ20 ప్రెసిడెన్సీ పోస్టర్లు ఆవిష్కరించారు. ఐఐటీ జీ20 కమిటీ సభ్యులు దేబరాజ్ రథ్, ప్రొఫెసర్ పీవీ సత్యం, ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ సాహు, డాక్టర్ శ్రీనివాస్ భాస్కర్ కర్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న బాలలు

క్లుప్తంగా

జస్టిస్ మన్మధరావుకు ఘన స్వాగతం



జస్టిస్ కె.మన్మధరావుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న డీఆర్ఓ గణపతిరావు

విజయనగరం అర్బన్: జిల్లా పర్యటన నేపథ్యంలో నగరానికి శనివారం వచ్చిన గౌరవ జస్టిస్ కె.మన్మధరావుకు జిల్లా యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. స్థానిక జిల్లా పరిషత్ అతిథిగృహంలో ఆయనను జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆదివారం జిల్లా కోర్టులో న్యాయవాదులకు నిర్వహించే అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభం

విజయనగరం అర్బన్: తెల్ల రేషన్ కార్డుదారులకు ఏప్రిల్ నెలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ శనివారం ప్రారంభమైందని పౌర సరఫరాల జిల్లా అధికారి కె.మధుసూదనరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 5.78 లక్షల తెల్ల రేషన్‌కార్డుదారులకు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనశాలలకు, ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ కోసం 1,249 డిపోల ద్వారా 370 ఎండీయూ వాహనాలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 15లోగా ఇళ్లకు పంపిణీ చేసే ప్రక్రియ సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న మణికంఠ

పార్వతీపురం: ఓ వ్యక్తి మనస్తాపానికి గురై ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. పార్వతీపురం పట్టణంలోని విజయరామరాజు కాలనీకి చెందిన ఆర్.మణికంఠ ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. తన భార్యతో గత కొంతకాలంగా గొడవలు పడుతున్నాడు. ఈ మేరకు మనస్తాపానికి గురై ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు అవుట్‌పోస్టు పోలీసులు తెలిపారు.

కారు బోల్తా పడి ఎంపీపీకి గాయాలు



ప్రమాదంలో బోల్తా పడిన కారు

బొండపల్లి: మండల కేంద్రం నుంచి తన కారులో విజయనగరం వెళ్తుండగా జాతీయ రహదారి 26పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు.. తన కారులో ఎంపీపీ చలంనాయుడు విజయనగరం బయలుదేరారు. మార్గంలో నెలివాడ – అంబటివలస గ్రామాల మధ్య కారుకు కుక్క అడ్డు రావడంతో తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎంపీపీకి స్వల్ప గాయాలయ్యాయి.

జాతీయ పోటీలకు సంతోష్‌కావ్య



బి.సంతోష్ కావ్య

రాజాం సిటీ: కేరళ రాష్ట్రం కాలికట్‌లో ఈ నెల 3 నుంచి 6 వరకు జరగనున్న జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరఫున జీఎంఆర్ ఐటీ విద్యార్థిని బి.సంతోష్ కావ్య ఎంపికైందని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ ఎంపికలు ఇటీవల అమలాపురంలో జరిగాయని పేర్కొన్నారు. ఈమెను ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: అంతర్జాతీయ స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన శిక్షకులకు ప్రదానం చేసే నగదు పురస్కారాలకు ఈ నెల 30లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర యూత్ అఫైర్స్/స్పోర్ట్స్ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 2022 ఆగస్టు 11వ తేదీకి ముందు విజేతలు మాత్రమే దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

డిజిటల్ గ్రంథాలయాలకు శ్రీకారం

- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ శేషగిరిరావు
- 'మనం మన గ్రంథాలయం' కార్యక్రమం ప్రారంభం



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాల అలమరను పరిశీలిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ శేషగిరిరావు

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో డిజిటల్ గ్రంథాలయం శకం ప్రారంభమైందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం నగరానికి వచ్చిన ఆయన స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. తొలిత గ్రంథాలయంలోని గ్రంథ, పుస్తక అలమరలను పరిశీలించారు. గ్రంథాలయ సందర్శకుల సంఖ్యను తెలుసుకొని వారు చదివే పుస్తకాల అభిరుచిని తెలుసుకున్నారు. గ్రంథాలయంలో పఠనకు వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. పరిసరాలు, పుస్తకాల అలమరలను శుభ్రం చేసి చూపించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న 'మనం మన గ్రంథాలయం' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెల మొదటి శనివారం అన్ని గ్రంథాలయాలు ఒక స్ఫూర్తిదాయకమైన కార్యక్రమంగా తీసుకురావడం జరుగుతుందన్నారు. మన ఇంటిని ఏ విధంగా సొంతంగా భావించి శుభ్రంగా ఉంచుకుంటామో అదే విధంగా గ్రంథాలయాలను దేవాలయాలుగా ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని గ్రంథాలలో డిజిటల్ విభాగాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. గ్రంథాలయాల విశిష్టతను పాఠకులకు, ప్రజలకు తెలియజేయాలనే స్ఫూర్తిని తీసుకొని గ్రంథాలయ జిల్లా ఛైర్మన్, కార్యదర్శి కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రతి గ్రంథాలయంలో చేపట్టే విధంగా ప్రణాళికలు వేశామన్నారు. డిజిటల్ గ్రంథాలయ సౌకర్యాలను రాష్ట్ర వ్యాప్తంగా 9,500 గ్రంథాలయాలో ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేశామని చెప్పారు. ఇటీవల అన్నవరంలో తొలిత ప్రారంభించామని అన్నారు. విద్యా వ్యవస్థలో మాదిరిగానే 'నాడు నేడు' కార్యక్రమాన్ని గ్రంథాలయాలలో చేపడుతున్నామని వెల్లడించారు. ఉన్నతమైన ఆలోచనలతో గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అని కొనియాడారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాదిని 'జగన్మోహన్ డిజిట్ శుభకృతి నామ సంవత్సరం'గా గ్రంథాలయ సంస్థ ప్రకటించిందని తెలిపారు. ఈ సంవత్సరం అంతా అదే స్ఫూర్తితో ముందుకు వెళ్లడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, కార్యదర్శి ఎస్.లలిత, డిప్యూటీ లైబ్రేరియన్ లక్ష్మి, సహాయ గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ గ్రంథాలయాలు సీఎం లక్ష్యం

బాడంగి: రాష్ట్రంలో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా చర్యలు చేపట్టినట్టు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైరమన్ మందపాటి శేషగిరిరావు చెప్పారు. బాడంగి గ్రంథాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. గ్రంథాలయంలో విద్యార్థులకు కంప్యూటర్ నేర్పించడం, వేసవి తరగతులు ప్రారంభించడాన్ని మెచ్చుకున్నారు. పాఠకుల హాజరు పెంచేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం పిన్నవలసలో నిర్మాణంలో ఉన్న డిజిటల్ గ్రంథాలయాన్ని జెడ్పీటీసీతో కలిసి తిలకించారు. ఆయన వెంట గ్రంథాలయాధికారి దుర్గాప్రసాద్ ఉన్నారు.

వసుధైక కుటుంబ సాధనలో యువత కీలకం

- గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి



మాట్లాడుతున్న గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: భారతదేశం భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన వసుధైక కుటుంబమని దాన్ని కొనసాగించే బాధ్యత యువతదేనని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమణి అన్నారు. అజాదీకా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకొని వివేకానంద ఫర్ కల్చర్ యోగ అండ్ మేనేజ్‌మెంట్ ఒడిశా సౌజన్యంతో స్థానిక గిరిజన యూనివర్సిటీలో 'సివిల్ సొసైటీ – 20' శనివారం నిర్వహించిన జీ–20 సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరికి ఒకరు సహకారం అందించుకొని మానవ మనుగడకు సహకరించుకోవాలని భగవద్గీత, ఉపనిషత్తులలో తెలిపారని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులను గురించి మాట్లాడమే కాకుండా తమ బాధ్యతలను కూడా నిబద్ధతతో నిర్వహించాలని కోరారు. అనంతరం విద్యార్థులు వసుధైక కుటుంబం సాధనకు వివిధ సలహాలు సూచనలతో కూడిన ప్రెజెంటేషన్స్ ఇచ్చారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా డాక్టర్ కుసుమ్ వ్యవహరించారు. కార్యక్రమంలో అరుణాచల్‌ప్రదేశ్ వివేకానంద కేంద్ర జీవనవర్తి కార్యకర్త లక్ష్మీనారాయణ, సుజాత, వివేకానంద ఫర్ కల్చర్ యోగ అండ్ మేనేజ్‌మెంట్ ఒడిశా, ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యకర్త రవి, ప్రొఫెసర్ మిశ్రా, ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు, ప్రొఫెసర్ శ్రీనివాసన్, డాక్టర్ అప్పాసాభా అధితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి..

- విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ పార్థసారథి ఘోష్



మాట్లాడుతున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ జీఎం పార్థసారథి ఘోష్

డెంకాడ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని, వాటి సాధనకు నిరంతరం పరితపించాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ పార్థసారథి ఘోష్ అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం విద్యార్థి సంఘం విధాత్రి ఆధ్వర్యంలో శనివారం యువజనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా.. ప్రజల అవసరాలు, ఆలోచనలకు అనుగుణంగా సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. అనంతరం 3డీ ప్రింటింగ్ క్లబ్‌ను ప్రారంభించారు. గౌరవ అతిథి విశాఖ స్టీల్‌ప్లాంట్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్. దీప్లానాయక్ మాట్లాడుతూ, విద్యార్థులు ఏదైనా సాధించాలంటే ముందుగా నేర్చుకోవాలన్న తపన ఉండాలన్నారు. నాయకత్వ లక్షణాలు, భావ వ్యక్తీకరణ చాలా ముఖ్యమని తెలిపారు. అనంతరం నిర్వాహకులు అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, విభాగాధిపతి సతీష్‌పూజారి, వైస్ ప్రిన్సిపాళ్లు టి.హరిబాబు, ఏవీ పరాంకుశం, విభాగాధిపతులు జి.ప్రకాష్‌బాబు, రాజన్‌బాబు, రామారావు, రాజేంద్ర, సుబ్బరామయ్య, దుర్గాశైలజ, సతీష్, వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఛాలెంజ్ సందర్శన



బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్‌తో క్యాంపస్‌ఛాలెంజ్ పిల్లలు


పూసపాటిరేగ: మండలంలోని కోనాడ కూడలి వద్ద ఉన్న క్యాంపస్ ఛాలెంజ్‌ను బ్రిటన్ డెప్యూటీ హైకమిషనర్ గారేత్‌విన్‌ఓవెన్ శనివారం సందర్శించారు. హెచ్ఎంఎస్ తమర్‌పి–233 యునైటెడ్‌కింగ్‌డమ్‌కు చెందిన యుద్ధనౌక విశాఖ పోర్టుకు వచ్చింది. యుద్ధనౌకలో ఉన్న బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ గారేత్‌విన్‌ఓవెన్‌తో పాటు బ్రిటన్ రోయల్ నేవీ సిబ్బంది క్యాంపస్ ఛాలెంజ్‌కు చేరుకున్నారు. అక్కడి దివ్యాంగులు వసతిగృహాన్ని పరిశీలించారు. పిల్లలతో కాసేపు ముచ్చటించారు. విద్య, వైద్య సేవల తీరును తెలుసుకున్నారు. పిల్లల నివాసన ముదాయాలకు పెయింటింగ్ వేశారు. సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బ్రిటన్ ఎంబీసీ అధికారి పద్మజ, కోరుకొండ సైనిక్‌స్కూల్ పూర్వ విద్యార్థులు జీఆర్‌సీ బోస్, డీఎస్ రాజు, లక్ష్మణరావు, క్యాంపస్‌ఛాలెంజ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ల పరిశీలన

భోగాపురం: మండల కేంద్రంలో వ్యాపారులు నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌లను మెట్రాలజీ ఫుడ్ సేఫ్టీ అధికారులు శనివారం పరిశీలించారు. పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వరరావు, నరసింగరావు వాటర్ ప్లాంట్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకుపోయిన కారు

- ముగ్గురికి స్వల్ప గాయాలు



పొలాల్లో ఉన్న కారు

కాశీబుగ్గ: వేగనర్ కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘన పలాస మండలం తర్లాకోట గ్రామం కాటమ్మతల్లి ఆలయ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఒడిశాకు చెందిన ముగ్గురు యువకులు గారబంద నుంచి పలాస వయా గొప్పిలి మీదుగా కారులో వస్తుండగా.. తర్లాకోట వద్ద అదుపుతప్పి పంట పొలంలోకి దూసుకుపోయి ఆగిపోగా.. అందులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

తుంగతంపరలో చైన్‌స్నాచింగ్



బాధితురాలు అమ్మలు నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

హిరమండలం: తుంగతంపర గ్రామ సమీపంలో చైన్‌స్నాచింగ్ జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతంపర గ్రామ కాలనీకి చెందిన గుజ్జాపు అమ్మలు వృత్తిలో భాగంగా రోజూ ఉదయం పూట గ్రామ సమీపంలోని చెరువుకు దుస్తులను ఉతికేందుకు వెళ్లి మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వస్తుంటారు. శనివారం కూడా చెరువు వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెనుక నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకొని పరారయ్యారు. వెంటనే బాధితురాలు కేకలు వేయడంతో దుండగులు నవతల గ్రామం వైపు ఉడాయించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జి.నారాయణ స్వామి తెలిపారు.

సంగీతానికి పుట్టినిల్లు విజయనగరం



మాధవపెద్ది సురేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: విజయనగరం సంగీతానికి పుట్టినిల్లు అని సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ అన్నారు. ఆయనను ఘంటసాల సంగీత సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుడు సముద్రాల గురుప్రసాద్ ఉచిత రీతిన సత్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ విజయనగరంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని, వాజీ చానల్ నిర్వహించిన పాటలపల్లకి కార్యక్రమంలో పాల్గొన్నానన్నారు. బీఏ నారాయణ, ధనంజయ్ వంటివారిని వెండితెరకు పరిచయం చేశానని తెలిపారు. సంగీతం సార్వజనీనమైనదని, ట్యూన్‌కు పాట ఇవ్వడం కంటే, రాసిన పాటకు ట్యూన్ చేయడాన్ని ఇష్టపడతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ యూత్ సర్వీసెస్ డైరెక్టర్ కేఆర్‌కే రాజు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

- సమీక్ష సమావేశంలో ఎస్పీ జి.ఆర్.రాధిక



నెలవారీ నేరసమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: నేర నియంత్రణకు నిఘా నేత్రం (సీసీ కెమెరాల)తో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాధిక అధ్యక్షతన నెలవారీ నేర సమీక్షా సమావేశం శనివారం జరిగింది. ముందుగా స్పందన ఫిర్యాదులు, ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు, తీవ్ర నేరాలు ((గ్రేవ్ కేసులు), ఎన్డీపీఎస్ యాక్ట్, ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల్లోని పలు అంశాలపై సమీక్ష నిర్వహించి ముఖ్యమైన కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని ముఖ్యకూడళ్లలో బంగారం దుకాణాలు, వ్యాపార సంస్థలు, అపార్ట్‌మెంట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని తరహా నేరాలు ఛేదించడంలో సీసీ పుటేజీ కీలకమన్నారు. మహిళా పోలీసులతో క్షేత్రస్థాయిలో ఎంఆధార్ యాప్‌లో బయోమెట్రిక్ ఎనేబుల్డ్ పేమెంట్ సర్వీసులో డబ్బు పోగొట్టుకునే విధానం, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా నియమాలు, అక్రమ రవాణా, అక్రమ వ్యాపారుల వలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ కేసుల్లో ప్రాపర్టీ సీజింగ్, కేసు దర్యాప్తు, ముద్దాయిల అరెస్టులో జాగ్రత్తలను పాటిస్తూ ముద్దాయిలకు జైలు శిక్ష పడేలా చేయాలన్నారు. అపరిష్కృతంగా ఉన్న కేసులపై దృష్టిసారించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిశితమైన సాక్ష్యాధారాలు సేకరించాలని, 60 రోజుల్లోగా దర్యాప్తు పూర్తిచేసి కేసుకు సంబంధించిన అన్ని రకాలైన పత్రాలతో కోర్టులో అభియోగం పత్రాలను దాఖలు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో వంటి ముఖ్య కేసులన్నింటిలో ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సాక్ష్యాధారాల సేకరణలో, సాక్షుల విచారణలో జాగ్రత్తలు పాటిస్తూ ప్రాంతీయ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు ఆధారాలు పంపించాలన్నారు. వారిచ్చిన అభిప్రాయాల మేరకు నిర్ణీత గడువులోగా దర్యాప్తును పూర్తి చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయాలన్నారు. సాంకేతికతతో త్వరితగతిన సైబర్ కేసులను దర్యాప్తు చేయాలని, మహిళా పోలీసులను సమన్వయం చేసుకుంటూ దిశ యాప్, సైబర్ మోసాలపై గ్రామ, పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీకాంత్, అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, డీఎస్పీలు ఎం.మహేంద్ర, సీహెచ్ ప్రసాదరావు, ఎస్.వాసుదేవ్, జి.శ్రీనివాసరావు, ఎం.శివరామరెడ్డి, కె.బాలరాజు, డి.ప్రసాదరావు, ఏవో ఎం.శివరామరాజు, సీఐలు, వివిధ పోలీసు స్టేషన్ల ఎస్సైలు పాల్గొన్నారు.

అక్రమ క్వారీలో అధికారుల తనిఖీలు

పొందూరు: మండలంలోని వీఆర్ గూడెం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 137లో ఉన్న కొండ గ్రావెల్ క్వారీలో అక్రమ తవ్వకాలపై శనివారం మైనింగ్, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గురువారం రాత్రి అక్రమ తవ్వకాలు చేస్తుండగా విద్యార్థి బగాది మణికంఠ (20) మృతి చెందడంతోనే అక్రమ క్వారీ నిర్వహణ వెలుగులోకి వచ్చింది. సర్వే నంబర్ 137లో సుమారు 475.95 ఎకరాల కొండ ప్రాంతం ఉండగా, సంఘటన జరిగిన ప్రదేశంలో సుమారు 1200 క్యూబిక్ మీటర్ల తవ్వకాలు జరిపినట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. తనిఖీల్లో మైనింగ్ డీడీ ఫణిభూషణ్ రెడ్డి, ఏడీ బాలాజీ నాయక్, సర్వేయర్ గోవిందరావు, ఆర్ఐ రాధ, వీఆర్వో సూర్యప్రకాశరావు ఉన్నారు. కాగా చుట్టుపక్కల ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై అధికారులు సమాచారం ఇవ్వకపోవడం, వాటి గురించి ప్రస్తావన లేకపోవడం విశేషం.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: సీఎంఆర్‌ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండలంలోని బూరాడపేటకు చెందిన బూరాడ ప్రకాష్‌కు మంజూరైన రూ.1.50 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే శనివారం అందజేశారు. గతంలో తన కుడికాలికి తీవ్రగాయం కాగా అప్పట్లో తన కాలికి జరిగిన చికిత్సకు ఆరోగ్యశ్రీ వర్తించలేదని, ఈ క్రమంలో తన సొంత డబ్బులతో ఆపరేషన్ చేయించుకున్నానని, ఈ నగదు కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా, ఇప్పుడు వచ్చిందని సంతోషంగా ఉందని లబ్ధిదారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బి.నర్సింహులు, సర్పంచ్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



విద్యార్థి ప్రశ్నకు సమాధానం ఇస్తున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్టు బీఆర్ఏయూ వీసీ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో నెలలో మొదటి శనివారం నిర్వహించే డయల్ యువర్ వర్సిటీ ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమాన్ని ఉదయం పది నుంచి 11 గంటల వరకు నిర్వహించారు. విద్యార్థుల ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. అనంతరం సమస్యలపై వీసీ సమీక్షించారు. విద్యార్థులు ప్రస్తావించిన సమస్యలు పరిష్కరించాలని, వారి సూచనలు, సలహాలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ఫోన్ ఇన్ లైవ్‌లో విద్యార్థులు ప్రధానంగా డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని, డిగ్రీ ఏడాది విధానంలో పరీక్ష రాసిన విద్యార్థులు ఇంకా పాస్ కాలేదాని వారికోసం ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలని కోరారు. డిగ్రీ 2, 4 సెమిస్టర్ ఫలితాలు విడుదలపై ప్రశ్నించారు. డిగ్రీ, పీజీ రీవాల్యూయేషన్ ఫలితాల జాప్యంపై అడిగారు. అధికారులు స్పందిస్తూ ఏటా స్పెషల్ డ్రైవ్ పరీక్షల నిర్వహణ సాధ్యం కాదని, పరీక్ష ఫలితాలు జ్ఞాన భూమి వెబ్‌సైట్ ద్వారా విడుదల చేస్తున్నామన్నారు. రీవాల్యూయేషన్ ఫలితాలు షెడ్యూల్ మేరకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ బిడ్డిక అడ్డయ్య, ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

వీరగున్నమ్మ కీర్తి..

భావితరానికి స్ఫూర్తి



మందసలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

- రాజ్యసభ మాజీ సభ్యుడు పి.మధు
- ఘనంగా వర్ధంతి కార్యక్రమాలు
- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు

మందస: తెల్లదొరలపై కత్తులు దూసిన వీరగున్నమ్మ కీర్తిని భావితరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు పి.మధు అన్నారు. గుడారిరాజమణిపురం(వీరగున్నమ్మపురం) గ్రామానికి చెందిన వీరనారి సాసుమాన గున్నమ్మ 83వ వర్ధంతి కార్యక్రమాలు వీరగున్నమ్మపురం సమీపంలో గున్నమ్మ స్థూపం, మందసలో శనివారం జరిగాయి. మందసలోని బస్టాండ్‌లో సీఐటీయూ, గిరిజన సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మధు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల కాల్పుల్లో వీరగున్నమ్మతో పాటు ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. తెల్లదొరల సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కమ్యునిస్టు పార్టీ నడిపిన గొప్ప రైతాంగపోరాటమన్నారు. నాడు, నేడు కూడా జమీందారులకు ప్రభుత్వాలు కార్పెట్లు పరుస్తున్నాయని ధ్వజమెత్తారు. గతంలో విదేశీ దురాక్రమణలు జరగ్గా, నేడు స్వదేశీ అరాచకాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రకృతి వనరులైన గాలి, నీరు, భూమి, సూర్యరశ్మి, అడవులు, గనులు అదాని కంపెనీలకు ధారదత్తం చేస్తున్నారని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ.. వంశధార, ఆఫ్‌షోర్ రిజర్వాయర్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, జీడి రైతులకు మద్దతు ధర క్వింటాకు రూ.16 వేలు ప్రకటించాలన్నారు. గిరిజన భూములను ఆక్రమించుకుంటున్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముందుగా వీరగున్నమ్మ స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మందస పురవీధుల్లో ర్యాలీ, ప్రదర్శన చేశారు. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రజా సంఘాల నాయకులు మట్ట ఖగేశ్వరరావు, కె.నాగమణి, బి.కృష్ణమూర్తి, సంగారు లక్ష్మీనారాయణ, సవర ధర్మారావు, పోలాకి ప్రసాదరావు, ఎస్.గణపతి, కె.కేశవరావు, మట్ట ధర్మారావు ప్రసంగించారు. వీరగున్నమ్మ చరిత్ర ప్రచారకమిటీ నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు వాయలపల్లి మాధవరావు, దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేంబాబుచౌదరి, సాసుమాన లోకేశ్వరరావులు కూడా గున్నమ్మ స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.